

పకడ్బందీగా ఎన్నికల కసరత్తు

జిల్లాలో పకడ్బందీగా ఎన్నికల కసరత్తు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ రాజశేఖర్ స్పష్టం చేశారు. - 8లో



హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా'

చిత్తూరులోని మెసానికల్ మైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా పోటీలు హోరాహోరీగా సాగాయి. - 8లో



కాలుదువ్విన కోడెగిత్తలు

వెదురుకుప్పం మండలం నంబాలపల్లెలో శుక్రవారం నిర్వహించిన పరుష పందేలు ఉత్సాహంగా సాగాయి. - 8లో

న్యూస్‌రీల్

పకడ్బందీగా వివరాల సేకరణ



ప్రక్రియను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల విధుల కోసం ఉద్యోగుల వివరాలను పకడ్బందీగా సేకరించాలని డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివరాల సేకరణ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ విజయేంద్రరావు పాల్గొన్నారు.

'సురక్ష'కు విశేష స్పందన

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా 16 ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులకు విశేష స్పందన లభించింది. శిబిరాల్లో 16 మంది పీహెచ్‌సీ డాక్టర్లు, 33 మంది ప్రత్యేక వైద్యులు పాల్గొన్నారు. మొత్తం 5,308 మందికి చికిత్సలందించారు. జనరల్ ఓపీకి 2,485 మంది, గైనిక్‌కు 512, చిన్నపిల్లల సేవలకు 288, ఆర్థోకు 742, డెంటల్ 103, చర్మం 125, కంటి సమస్యలు 701, ఇతర సేవలకు 352 మంది వచ్చారు. కంటి వెలుగు కింద 381 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

జీడీ నెల్లూరు అభివృద్ధికి రూ.65 లక్షలు



జేసీకి మెగాచెక్కు అందిస్తున్న ఐటీసీఎల్ ప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సీఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత)లో ఐటీసీఎల్ ప్రతినిధులు రూ.65 లక్షలు అందజేసినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఐటీసీఎల్ ప్రతినిధులు చెక్కు అందించారు. జేసీ మాట్లాడుతూ జీడీ నెల్లూరు నియోజకవర్గం పిళ్లారికుప్పంలో కమ్యూనిటీ హాల్, ఆవులాపూర్ మైనారిటీ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐటీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ యోహాన్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సతీష్‌కుమార్, సీనియర్ ఆపరేషన్స్ మేనేజర్ బాలమురుగన్, రఘువంశీ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న లే అవుట్లలో ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. జిల్లాలో మొత్తం 256 లేఅవుట్లలో 24,699 మందికి స్థలాలు ఇచ్చారన్నారు. మొత్తం 92 సచివాలయాల్లో ఇప్పటి వరకు దాదాపు వెయ్యి రిజిస్ట్రేషన్స్ చేసినట్లు వివరించారు.

కుష్టు రహిత సమాజమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

యాదమరి: కుష్టురహిత సమాజమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్ నిర్మూలన అధికారి వెంకటప్రసాద్ కోరారు. శుక్రవారం యాదమరి మెయిన్ బజారులో వైద్యాధికారులు, సిబ్బందితో కలసి కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. వెంకటప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టు వ్యాధి పరీక్షలు చేయాలన్నారు. నొప్పిలేని మచ్చలు ఉంటే వెంటనే చికిత్సలందించాలని సూచించారు. బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

పూతలపట్టు : స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంగ్లిషు మీడియానికి సంబంధించి ప్రవేశానికి ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 5 వతరగతి ఇంగ్లిషు మీడియంలో ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి 10వ తేదీ ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

గుర్తిద్దాం.. జయిద్దాం!

నిరుపేదలకు పెనుభారంగా మారిన క్యాన్సర్‌కు కళ్లెం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వ్యాధిని ఆదిలోనే గుర్తించి సకాలంలో వైద్యాన్ని అందించాలని నిర్ణయించింది. తద్వారా ఆ రోగులను సాధారణ స్థితికి తీసుకురావొచ్చని భావిస్తోంది. ఈమేరకు ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు శ్రీకారం చుట్టనుంది. ఇందుకు తిరుపతి జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఆపై దశలవారీ రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనుంది. దీని కోసం జిల్లా వైద్యఆరోగ్యశాఖ సమన్వయంతో, సచివాలయ వ్యవస్థ సహకారంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహణకు సంకల్పించింది.

– సాక్షి, తిరుపతి డెస్క్

క్యాన్సర్ మహమ్మారి కట్టడికి చర్యలు

- ముందుగానే గుర్తించేందుకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు
- స్క్రీనింగ్ పరీక్షల కోసం రెండు ప్రత్యేక బస్సులు
- పైలెట్ ప్రాజెక్టుగా తిరుపతి జిల్లా ఎంపిక
- 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శ్రీకారం
- వైద్యఆరోగ్యశాఖ, సచివాలయ వ్యవస్థ సహకారం



మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ బస్

క్యాన్సర్ మహమ్మారిని ముందుగా గుర్తిస్తే మట్టికరిపించవచ్చు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి సరైన చికిత్స చేయడం వల్ల 90 శాతం వరకు నయం చేయొచ్చు. అదే రెండో దశలో ఇచ్చే చికిత్స వల్ల 60 నుంచి 70 శాతం, మూడో దశలో 30 నుంచి 40 శాతం వరకు ఆయుష్షును పొడిగించవచ్చు. అయితే నాలుగో దశలో చేసే చికిత్స వల్ల ఆయుఃప్రమాణం పెరిగే అవకాశం ఉందని కచ్చితంగా చెప్పలేం. కాబట్టి క్యాన్సర్ లక్షణాలు కనబడిన వెంటనే గానీ, తొలి దశలోగానీ గుర్తించి చికిత్స అందిస్తే మామూలు జీవితాన్ని గడిపేయవచ్చు.

క్యాన్సర్ నిర్మూలనకు భారీ వ్యవస్థ

క్యాన్సర్ విస్తరణ.. చికిత్స విధానాలు అన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ప్రాథమిక దశలోనే చికిత్స అందించేందుకు ఓ భారీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించేందుకు తిరుపతి జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం నుంచి తిరుపతి జిల్లాలో నిర్దేశించిన గ్రామ సచివాలయ పరిధిలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభం కానుంది.

రోజుకు 300 మందికి పరీక్షలు

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఒక్కో యూనిట్‌లో రోజుకు 300 మందికి పరీక్షలు నిర్వహించే సామర్థ్యంతో ఈ ప్రత్యేక బస్సును డిజైన్ చేశారు. మ్యామోగ్రామ్, సర్వేకల్, నోటి క్యాన్సర్‌కు సంబంధించి క్షేత్రస్థాయికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్‌ను నిర్వహిస్తారు. ఇందుకోసం వైద్యులు, టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది మొత్తం 17 మందితో స్పెషల్ టీమ్ సిద్ధంగా ఉంటుంది.

వైద్య ఆరోగ్యశాఖ సమన్వయం

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా వైద్యఆరోగ్యశాఖ సహకారంతో శ్రీబాలాజీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముందుగానే రూట్ మ్యాప్ ప్రకటిస్తుంది. నిర్దేశించిన గ్రామ సచివాలయ పరిధిలో అక్కడి ఏఎన్ఎం, ఆశా వర్కర్లు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల వివరాలు సేకరిస్తారు. ఇందుకోసం రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఎప్పుడు, ఎక్కడ, ఏ టైమ్‌కు ఉంటుందనే విషయాలను ఇంటింటా వెళ్లి తెలియజేస్తారు. అలా నిర్దేశించిన రోజున ఆ ప్రాంతానికి వెళ్లి మొబైల్ యూనిట్ల ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. రోజుకు రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు.



స్క్రీనింగ్ కోసం రెండు యూనిట్లు

తిరుపతి జిల్లాలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించేందుకు రెండు యూనిట్లను సిద్ధం చేశారు. 17 మంది జట్టుతో ఒక్కో యూనిట్ సిద్ధంగా ఉంది. క్యాన్సర్ నిర్ధారణ కోసం ఒక్కో బస్సుకు రూ.3 కోట్ల వ్యయం చేసి, రెండు స్పెషల్ బస్సులను సిద్ధం చేశారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫౌండేషన్, అంబుజీ, రోటరీక్లబ్ సంయుక్తంగా ఓ ప్రత్యేక బస్సును స్విమ్స్‌కు విరాళంగా అందజేశారు.

సమాచారం

క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం సిద్ధం చేసిన బస్సు యూనిట్లు :
రెండు
ఒక్కో యూనిట్లో ఉండే వైద్యుల బృందం :
17 మంది
ఎవరెవరు :
వైద్యులు– 4, నర్సులు – 4, టెక్నీషియన్లు– 2, ఎలక్ట్రీషియన్ –1, డీపీఓ – 1, మెడికో సోషల్ వర్కర్ –1, డ్రైవర్ –1, సెక్యూరిటీ 1, అటెండర్ –2
మొబైల్ స్క్రీనింగ్ యూనిట్లో చేసే పరీక్షలు :
మామోగ్రామ్, సర్వైకల్, నోటి క్యాన్సర్
బస్సులో పరికరాలు :
కోటి విలువైన వ్యామోగ్రామ్, అల్ట్రాసౌండ్, ఓరోస్కోప్, కోల్పోస్కోప్, ఈసీజీ తోపాటు థర్మామీటర్, వెయిటింగ్ మిషన్

ఇది ఆరంభమే



క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. వ్యాధిని ఆదిలోనే గుర్తించాలంటే ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపట్టాలి. అందుకే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌కు సంకల్పించారు. ఆదివారం నుంచి తిరుపతి జిల్లాలో మొబైల్ స్క్రీనింగ్ యూనిట్లు ప్రారంభం కానున్నాయి. వివరాలు నమోదు చేసేందుకు ప్రత్యేక యాప్ సిద్ధం చేశాం.

– డాక్టర్ జయచంద్రారెడ్డి, స్పెషల్ ఆఫీసర్, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, తిరుపతి

రూట్ మ్యాప్ సిద్ధం



మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించేందుకు జిల్లాలో రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. రోజూ వేర్వేరు రెండు ప్రాంతాల్లో రెండు స్పెషల్ బస్సుల ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతాం. క్యాన్సర్ స్క్రీనింగ్ క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు గ్రౌండ్ వర్క్‌ను ఇప్పటికే పూర్తి చేశాం. క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ ప్రాజెక్టుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ సంసిద్ధంగా ఉంది.

– డాక్టర్ యూ.శ్రీహరి, వైద్యఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి జిల్లా





స్క్రీనింగ్ కోసం సమకూర్చిన అత్యాధునిక పరికరాలు

పక్కాగా ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీతో సమావేశమయ్యారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం జిల్లాలో 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 32,757 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుందని వివరించారు. నిర్వహించబడుతాయని తెలిపారు. విద్యార్థులకు ఆయా కళాశాలల్లో సకాలంలో హాల్ టికెట్లు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాలలో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఆయా సెంటర్ల వద్ద 144 సెక్షన్ విధించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్‌మౌలా, డీఈసీ మెంబర్లు దయానందరాజు, బాలసుబ్రమణ్యం, మురళీకృష్ణ, డీఈఓ విజయేంద్రరావు పాల్గొన్నారు.

బోయకొండలో రాహుకాల అభిషేకం



అన్నదానం చేస్తున్న దృశ్యం

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో విశేష అభిషేకం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ క్రమంలో సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాదం వితరణ చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

- చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గానికి రెడ్డెప్ప, జీడీ నెల్లూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు నారాయణస్వామి





రెడ్డెప్ప, నారాయణస్వామి

సాక్షి, చిత్తూరు: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను శుక్రవారం ప్రకటించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లా పరిధిలోని రెండు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఈమేరకు చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం(ఎస్సీ) సమన్వయకర్తగా ఎంపీ రెడ్డప్ప, జీడీనెల్లూరు(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు పేర్కొంది. పార్టీ ప్రకటనపై సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప స్పందిస్తూ ముఖ్యమంత్రి జగనన్న, మంత్రి పెద్దిరెడ్డి అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని, పార్టీ గెలుపు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని వెల్లడించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

హామీ ఇచ్చి..ఉద్యోగాలు కల్పించి!



నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులతో ఎమ్మెల్సీ భరత్

కుప్పం: యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్సీ భరత్ నెరవేర్చారు. వారి జీవితాల్లో వెలుగులు నింపారు. వివరాలు.. కుప్పంలో ఇటీవల నిర్వహించిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు యువకులు ఉద్యోగాల కోసం ఎమ్మెల్సీకి వినతులు సమర్పించారు. దీనిపై ఆయన స్పందించారు. వివిధ కంపెనీల యాజమాన్యాలను సంప్రదించారు. 20 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆ కంపెనీలు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో పలు కంపెనీలు ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి జాయినింగ్ ఆర్డర్స్ అందజేశారు. నిరుద్యోగులు తన కార్యాలయంలో సంప్రదిస్తే వారి విద్యార్హతలను బట్టి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ వెంటే న్యాయవాదులు



విజయానందరెడ్డిని సత్కరిస్తున్న న్యాయవాదులు

చిత్తూరు కార్పొరేషన్: న్యాయవాదులు ఐక్యంగా వైఎస్సార్‌సీపీ వెంటే నడుస్తున్నారని పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో న్యాయవాదుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో జిల్లా మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. లా నేస్తం ద్వారా ప్రభుత్వం నియోజకవర్గంలోని జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా రూ.10 లక్షలు అందిస్తోందని వెల్లడించారు. నూతన కోర్టు భవన నిర్మాణానికి నిధులు విడుదల చేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా చిత్తూరులో షుగర్, న్యూట్రిన్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఎస్ఆర్‌పురంలో తన భాగస్వామ్యంతో ఐటీ పరిశ్రమను తీసుకువచ్చినట్లు వివరించారు. చిత్తూరుకు హైవే సదుపాయం ఎక్కువగా ఉండటంతో పరిశ్రమల స్థాపనకు మెరుగైన వెసులుబాటు ఉందని తెలిపారు. ఎన్నికల తర్వాత నెలలో ఒక ఆదివారం నియోజకవర్గంలోని న్యాయవాదులతో పరిసరాలు–పరిశుభ్రత అనే కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. అనంతరం విజయానందరెడ్డిని న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీపీ లోకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, పార్లమెంట్ అధ్యక్షుడు పులికల్లు రవీంద్రనాథ్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్, సీనియర్ న్యాయవాది చంద్రశేఖర్, న్యాయవాది హిమబిందు, న్యాయవాది సుగుణశేఖర్‌రెడ్డి, గుమస్తాల సంఘం అధ్యక్షుడు ఉదయసూర్యన్ పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం



పుత్తూరులో బలిజ సంఘ భవనానికి భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా



వేపగుంటలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, అందులో భాగంగానే సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం ఆవిష్కరించారని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. గురువారం పుత్తూరు రూరల్ మండలం వేపగుంట గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి రహితంగా ప్రభుత్వ సేవలకు ప్రజలకు అందుతున్నాయన్నారు. గతంలో మండల కేంద్రాల్లోని కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరిగినా పనులు జరిగేవి కావని గుర్తు చేశారు. నేడు వలంటీర్ల ద్వారా ప్రతి సంక్షేమ పథకం ఇంటి వద్దకే చేరుతోందన్నారు. కోవిడ్ సమయంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సహాయ చర్యలను సచివాలయ సిబ్బంది ద్వారా అందించినట్లు వెల్లడించారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. అదే జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధిని చూడలేని కబోదులు టీడీపీ నాయకులని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈఈ వెంకటవినోదరెడ్డి, ఏఈ వీరయ్య, ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీపీ మునివేలు, ఎస్సీసెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ సుదర్శన్, సర్పంచ్ గిరిజాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణమూర్తి, వెంకటేశ్వర్లు, నరసింహులు, మోహన్‌గాంధీ, జయకుమార్, రాజయ్య, నాగరాజు, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

బలిజ సంఘ భవనానికి భూమి పూజ

స్థానిక గేట్‌పుత్తూరులోని గోవిందమ్మ గుంట వద్ద శుక్రవారం బలిజ సంఘ భవనానికి మంత్రి ఆర్‌కే రోజా భూమి పూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న పాలనలోనే సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. అందరూ బాగుండాలన్నదే జగనన్న లక్ష్యమని కొనియాడారు. అనంతరం గేట్‌పుత్తూరులో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, కౌన్సిలర్లు కుప్పమ్మ, భానుమతి, ఆలయ కమిటీ చైర్మన్లు రమేష్‌బాబు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేమూ ఓటర్లమే..!

- కాణిపాకంలోనే నివసిస్తున్నాం
- వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు దారుణం
- వరసిద్ధుని ఆలయ ఈఓ వెంకటేశు



ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి) : కాణిపాకం పంచాయతీలోనే తాము నివసిస్తున్నామని, ఇక్కడే ఓటు హక్కు నమోదు చేసుకున్నామని కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ కుటుంబానికి వేరే చోట ఓటు హక్కు లేదన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఆరు నెలల పాటు ఎక్కడ నివాసం ఉంటారో.. ఎక్కడ వంట చేసుకుని భుజిస్తారో.. నిద్రిస్తారో అక్కడ ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అయితే రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు ఉండకూడదని, అందుకే తమ కుటుంబానికి కాణిపాకంలో మాత్రమే ఓటు ఉందని వివరించారు. ఈ విషయాలను తెలుసుకోకుండా కొందరు మీడియా మిత్రులు తమను దొంగ ఓటర్లుగా పేర్కొనడం, పత్రికల్లో ప్రచురించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కాణిపాకంలో తాము నివసిస్తున్న ఇంటికి డోర్ నంబర్ లేదని, అయితే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తాత్కాలిక నంబర్ వేసి ఓటు హక్కు కల్పించవచ్చని వెల్లడించారు. ఈ క్రమంలో ఓటరు అప్లికేషన్‌లో డోర్ నంబర్ వేయలేదని, ఎన్నికల సంఘం వారే డోర్ నంబర్ కేటాయించారని వివరించారు. ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను కుటుంబ సమేతంగా కాణిపాకంలో నివసిస్తున్నాని, ఇది వాస్తవమని తెలిపారు. ఈ మేరకు పంచాయతీకి ఇంటి పన్ను సైతం చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. భారత రాజ్యాంగం ప్రకారం కాణిపాకంలో ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు తమకు వంద శాతం అర్హత ఉందని స్పష్టం చేశారు. దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

పకడ్బందీగా ఎన్నికల కసరత్తు


కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై కసరత్తును పకడ్బందీగా చేపడుతున్నట్లు డీఆర్‌ఓ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న డీఆర్‌ఓ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రచురణ తర్వాత చేర్పులు, మార్పులను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, భద్రత సిబ్బంది వివరాలను పకడ్బందీగా సేకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనరకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ చిన్నయ్య, డిప్యూటీ కలెక్టర్ భవానీ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో ఆడుతున్న ఫిరోజ్‌బేగం, రాఫియా



బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో విజేత జట్లు



హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా'

- ఆసక్తికరంగా సాగిన బ్యాడ్మింటన్ పోటీలు
- నేడు క్రికెట్ ఫైనల్స్.. విజేతలకు బహుమతుల ప్రదానం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని మెసానికల్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు హోరా హోరీగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీల్లో బ్యాడ్మింటన్ పురుషులు, మహిళల జట్ల ఫైనల్స్ ముగిశాయి. పురుషుల క్రికెట్ పోటీల్లో చిత్తూరు టీమ్ తొలుత బ్యాటింగ్ చేసి 92 పరుగులు సాధించింది. జీడీ నెల్లూరు జట్టు బ్యాటింగ్ చేస్తుండగా వివాదం తలెత్తడంతో డీఎస్‌డీఓ బాలాజీ మ్యాచ్‌ను రద్దు చేశారు. శనివారం ఉదయం 8.30 గంటలకు చిత్తూరు వర్సెస్ జీడీ నెల్లూరు మధ్య ఫైనల్స్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

బ్యాడ్మింటన్‌లో ఆకట్టుకున్న తల్లీకూతురు

మెసానికల్ మైదానంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా పురుషులు, మహిళల విభాగంలో మ్యాచ్‌లు నిర్వహించారు. మహిళల విభాగంలో చిత్తూరు, జీడీనెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ఈ మ్యాచ్‌లో నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన ఫిరోజ్ బేగం (అసిస్టెంట్ ప్రొఫెసర్, అపోలో యూనివర్సిటీ), ఇంటర్మీడియట్ చదువుతున్న ఆమె కుమార్తె రాఫియా ముస్కాన్ ఆటతీరు క్రీడాభిమానులకు ఆకట్టుకుంది. జిల్లా స్థాయి మహిళ బ్యాడ్మింటన్ పోటీల్లో జీడీ నెల్లూరు టీమ్‌పై చిత్తూరు జట్టు గెలుపొందింది.

నేడు ముగింపు కార్యక్రమం

మెసానికల్ మైదానంలో సాయంత్రం 4 గంటలకు శనివారం జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేయనున్నారు. ఇప్పటి జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో గెలుపొందిన జట్లకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహంగా ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.2.55 లక్షల చొప్పున రూ.17.85 లక్షలు అందజేసింది.ఈ మేరకు విజేతల ఖాతాల్లో నగదు జమచేశారు. అలాగే జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లకు రూ.4.65 లక్షల నగదు ఇవ్వనున్నారు.

8లోపు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీలోపు జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులకు కేటాయించిన ఇంటి పట్టాలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పురోగతిపై ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి సమీక్షించనున్నట్లు వెల్లడించారు. స్థలాలు తీసుకుని ఇంటి నిర్మాణం చేపట్టని వారి పట్టాలను రద్దు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ కార్డులను పకడ్బందీగా పంపిణీ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాకు 3,08,544 కార్డులు వచ్చాయని తెలిపారు. వాటిని ఎంపీడీఓలకు అందజేసినట్లు చెప్పారు. సంబంధిత ఎంపీడీఓలు ఈ మేరకు కార్డులను పంచాయతీ సెక్రటరీల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయించాలన్నారు. ఆదివారం ఆయా కార్డుదార్లు ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ ప్రభావతి, ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.

మధ్యంతర బడ్జెట్‌పై అవగాహన సదస్సు


పీఆర్‌ఎస్‌ఐ సభ్యులకు సన్మానం

తిరుపతి (అలిపిరి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్‌ఎస్‌ఐ) తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని న్యూ బాలాజీ కాలనీలోని గ్రీన్ హోమ్ డెవలపర్స్ కార్యాలయంలో మధ్యంతర బడ్జెట్-2024పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఇటీవల జాతీయ అవార్డులు పొందిన పీఆర్‌ఎస్‌ఐ సభ్యులు రమాకాంత శర్మ, ఆచార్య త్రిపుర సుందరి, ఎన్.బి.హర్షవర్ధన్ రెడ్డిని సంస్థ చైర్మన్ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్ర మోహన్, ఇతర సభ్యులు సన్మానించారు. ఉపాధ్యక్షుడు చంద్రమోహన్ రావు, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్ సహాయ కార్యదర్శి సాయికుమార్ రెడ్డి, మహిళా వర్సిటీ జర్నలిజం ప్రొఫెసర్ సి.వాణి, చార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ముసుగులో టీడీపీ నేతల రాద్ధాంతం


అధికారులతో టీడీపీ నేతల వాగ్వాదం

పలమనేరు : పట్టణంలోని వ్యవసాయమార్కెట్ కమిటీ వద్ద కొందరు టీడీపీ నేతలు శుక్రవారం అనవసర రాద్ధాంతం చేశారు. వి.కోట మార్కెట్‌కు సంబంధించిన శివునికుప్పం మ్యాంగో మార్కెట్‌లో ఇష్టానుసారంగా లైసెన్సులిచ్చి గదులు కేటాయిస్తున్నారంటూ నానా హంగామా సృష్టించారు. గదుల బహిరంగ వేలానికి వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. నిబంధనల మేరకే గదులు కేటాంచామని అధికారులు ఎంత నచ్చజెబుతున్నా వినిపించుకోకుండా వాగ్వాదానికి దిగారు. వివరాలు.. గత టీడీపీ ప్రభుత్వంలో వి.కోట సమీపంలోని శివునికుప్పంలో మామిడికాయల మార్కెట్‌కు ఏర్పాటుకు ఎన్నికల ముందు ప్రతిపాదనలు తీసుకువచ్చి మిన్నకుండిపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేసి ఏడెకరాల భూమిని చదునుచేసి మార్కెట్‌కు అప్పగించారు. ఇందులో 42 దాకా దుకాణాలను ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉంటుందని మార్కెటింగ్ ఇంజినీరింగ్ అధికారులు నిర్ధారించారు. ఇలా ఉండగా మ్యాంగోమార్కెట్ ఏర్పాటవుతోందని తెలిసి ఆ ప్రాంతానికే చెందిన పలువురు మామిడి వ్యాపారులు గతంలోనే లైసెన్సులు పొందారు. 42 గదులకు కేవలం 38 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం బహిరంగ వేలం ద్వారా గదులు కేటాయించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అయితే కొందరు టీడీపీ నాయకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ రైతులకు ఏదో అన్యాయం జరిగిపోతోందంటూ నానా యాగీ చేశారు. మార్కెటింగ్ ఆర్‌జేడీ రామాంజనేయులు, డీఈ హరినారాయణ రెడ్డి, ఏడీ పరమేశ్వరన్‌తో వాగ్వాదానికి దిగారు. ఎంత చెప్పినా వినకుండా కార్యాలయం ముందు నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. మార్కెట్ సెక్రటరీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ నిబంధనల మేరకే వేలం ద్వారా గదులు కేటాయిస్తున్నామన్నారు. టీడీపీ నేతలు గొడవ పెట్టుకునేందుకే ఇక్కడకు వచ్చినట్లు వెల్లడించారు. మామిడి రైతులకు మేలు జరుగుతుంటే ఓర్వలేకే టీడీపీ నేతలు ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని స్థానికులు సైతం చర్చించుకోవడం గమనార్హం.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 57,223 మంది స్వామివారిని దర్శించుకోగా 18,015 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎస్వీ జూలో చిత్తడి నేలలపై విద్యార్థులకు అవగాహన

తిరుపతి మంగళం : ఎస్వీ జూపార్క్‌లో శుక్రవారం ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జూ క్యూరేటర్ సెల్వం వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్తడి నేలలపై అవగాహన కల్పించారు. జంతు పరిరక్షణ, వాటి ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులతో పేపర్లతో వివిధ రకాల పక్షులు, జంతువుల బొమ్మలను తయారుచేయించి ప్రోత్సహించారు.

మందుబాబుల వీరంగం

కోట: స్థానిక మహాలక్ష్మమ్మ వీధిలో గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఇద్దరు యువకులు వీరంగం సృష్టించారు. పోలయ్య అనే వ్యక్తికి చెందిన గడ్డివామికి నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. మరో వీధిలోకి చొరబడి ఇంటి ముందు నిలిపి ఉంచిన హీరోహోండా మోటార్‌సైకిల్‌ను తగులబెట్టారు. అర్ధరాత్రి మంటలను చూసిన స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం స్థానికులంతా పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఎస్‌ఐ నాగబాబుకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మంటల్లో కాలుతున్న మోటార్ సైకిల్

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ నేత


విజయానందరెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న ముస్తాక్

చిత్తూరు కార్పొరేషన్: నగరానికి చెందిన బీజేపీ నేత ముస్తాక్ వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం నగరంలో ఆయనకు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్తాక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడించారు.







కాలుదువ్విన కోడెగిత్తలు

వెదురుకుప్పం మండలం జక్కిదొన పంచాయతీ నంబాలపల్లె (కేఎస్ పెంట) గ్రామంలో శుక్రవారం పరుష పందేలు నిర్వహించారు. జల్లికట్టును వీక్షించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అల్లి వద్ద సిద్ధంగా ఉన్న యువకులను కరతాళధ్వనులతో ప్రోత్సహించారు. ఈ క్రమంలో యువత ఉత్సాహంతో ఉరకలేశారు.. కాలుదువ్విన కోడెగిత్తను నిలువరించేందుకు బరిలో దూకారు.. పలకలను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు.. ఎద్దును అడ్డుకునేందుకు పరుగులు తీశారు. పలక చేతబట్టిన వారు విజయగర్వంతో నిలబడ్డారు. – వెదురుకుప్పం

